క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే 'పల్లా'



జనగామ: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెలే కేటీఆర్ జన్మదినం పురస్కరించుకుని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో పుట్టినరోజు



జనగామ: జనగామ మండలం శామీర్‌పేటలోని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన రుద్రమదేవి వృద్ధాశ్రమంలో బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన జ్ఞానేందర్ కుమారుడు ఆదిత్య వర్ధన్ మొదటి పుట్టినరోజు వేడుకలను హోం అధ్యక్షుడు తల్కపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిబ్బంది సుంకర దేవేందర్, కోఆర్డినేటర్ లక్ష్మీప్రసన్న, ఏఎస్‌ఎం మౌనిక, యోగా థెరపిస్ట్ మాధవి, అకౌంటెంట్ మార్క అనుష తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా దరఖాస్తు అందించాలి

కొడకండ్ల: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం నిర్దేశిత గడువులోగా దరఖాస్తులు అందించాలని ఏఈఓ కొంగ నవ్య కోరారు. పాకాల గ్రామ పంచాయతీలో రైతుల నుంచి బీమా దరఖాస్తులను బుధవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, నామిని ఆధార్ జీరాక్స్‌లను రైతుబీమా దరఖాస్తుకు జతచేసి ఈ నెలాఖరుకల్లా అందించి నమోదు చేసుకోవాలన్నారు. పంటల నమోదు కార్యక్రమానికి కూడా రైతులు సహకరించాలని ఆమె కోరారు. జీపీ కార్యదర్శి కోట బయ్యన్న, రైతులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో..

చిల్పూరు: జూన్ 28వ తేదీ వరకు పట్టాదార్ పాస్‌బుక్ కలిగిన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేయించుకోవాలని మల్కాపూర్ ఏఈఓ నర్సింహులు కోరారు. మండలంలోని మల్కాపూర్ రైతు వేదికలో బీమా దరఖాస్తు పత్రాలను రైతులకు అందజేశారు. గతేడాది నమోదు చేసుకోని రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు, నింపిన దరఖాస్తు ఫారంతో ఆయా గ్రామాల ఏఈఓలను కలువాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

బచ్చన్నపేట: గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని మండలంలోని బండనాగారం జీపీ కార్యదర్శి భరత్‌కుమార్ అన్నారు. బుధవారం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధుల్లో పారిశుద్ధ్య, తాగు నీటి సమస్యలు ఉంటే తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఇంటి, నల్లా పన్నులను సకాలంలో చెల్లించాలని అన్నారు. సమావేశంలో కారోబార్ ఎర్రోజు శ్రీనివాస్, ఆశా వర్కర్ ఇజ్జగిరి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ పల్లపు రామకృష్ణ, గ్రామస్తులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

స్టేషన్‌ఘన్‌పూర్: వివాహం చేసుకుంటానని నమ్మించి యువతిని లోబర్చుకుని మోసం చేసిన యువకుడిపై స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన మేకల లక్ష్మణ్.. అతడి స్నేహితుడి సహకారంతో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన యువతిని కొన్ని నెలల క్రితం ఫోన్‌లో పరిచయం చేసుకున్నాడు. అప్పటినుంచి ఫోన్‌లో మాట్లాడి ఆమె నివాసం వివరాలు తెలుసుకున్నాడు. యువతి హైదరాబాద్ మౌలాలి హౌసింగ్ బోర్డులో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్న విషయం తెలుసుకుని ఈనెల 19న లక్ష్మణ్ అక్కడికి వెళ్లాడు. వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెతో కలిసి అదేరోజు రాత్రి రైలెక్కి స్టేషన్ ఘన్‌పూర్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో ప్లాట్ ఫామ్‌పైన ఆమెతో గొడవ పడ్డాడు. మరుసటి రోజు యువతిని తీసుకుని తిరిగి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. అదే రోజు రాత్రి సమీపాన ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇంట్లో గడిపారు. ఆ రాత్రి ఆమెను లైంగికంగా లోబర్చుకున్నాడు. 21వ తేదీ ఉదయం యువతిని మౌలాలి వద్ద వదిలేసి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకుని లక్ష్మణ్ స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. యువతి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు మంగళవారం ఆలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు కేసును స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసులకు అప్పగించగా.. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్కు రాజు తెలిపారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



జనగామ: అసిస్టెంట్ ట్రెజరీ అధికారి చంద్రకళను సత్కరిస్తున్న ఉన్నతాధికారులు



కొడకండ్ల: అంజయ్యను సన్మానిస్తున్న చంద్రమోహన్, సిబ్బంది



బచ్చన్నపేట: బదిలీ అయిన టీచర్లకు మెమొంటో అందజేసి సత్కరిస్తున్న మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి

- బదిలీపై వెళ్లిన అధికారులు, ఉపాధ్యాయులకు ఘన సన్మానం

జనగామ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని పలువురు వక్తలు అన్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న చంద్రకళ నర్సంపేట కార్యాలయానికి బదిలీ అయ్యారు. కాగా, బుధవారం డీఈఓ కె.రాము, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ట్రెజరీ అధికారి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు.

తహసీల్దార్‌కు..

కొడకండ్ల: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన చిలుకల అంజయ్య వికారాబాద్‌కు బదిలీ అయ్యారు. కాగా, బదిలీ అయిన అంజయ్యకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి నాయబ్ తహసీల్దార్ కోల చంద్రమోహన్, ఆర్‌ఐ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ బదిలీ కావడంతో నాయబ్ తహసీల్దార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

చంద్రమోహన్‌కు..

మండల తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన కోల చంద్రమోహన్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అబ్దుల్లా, భిక్షపతి, మధుసూధన్, యాకేష్‌యాదవ్, రమేష్, శ్రీను, సతీష్‌గౌడ్, కుమార్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో ఆంజనేయులుకు..

జఫర్‌గఢ్: మండల తహసీల్దార్ ఆంజనేయులు బదిలీ అయ్యారు. కాగా, బదిలీపై వెళ్తున్న ఆయనను సీపీఎం, కాంగ్రెస్ నాయకులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించనున్న నాయబ్ తహసీల్దార్ హరిప్రసాద్‌ను కూడా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య, కాట సుధాకర్, గుండెబోయిన రాజు, ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు ఇల్లందుల శ్రీనివాస్, ఆర్‌ఐ అనిల్‌బాబు ఉన్నారు.



జఫర్‌గఢ్: ఆంజనేయులును సన్మానిస్తున్న నాయకులు

ఉపాధ్యాయులకు..

మండలంలోని జఫర్‌గఢ్, తమ్మడపల్లి (ఐ) ప్రభుత్వ పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలల్లో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. జఫర్‌గఢ్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన చాడ గణేశ్‌రెడ్డి, సుస్మిత, తమ్మడపల్లి (ఐ) పాఠశాలలో పని చేసిన హెచ్‌ఎం శాంతకుమారి, ఉపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, సునీత, స్వప్నను పూలదండలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. హెచ్‌ఎంలు పద్మా గోపిరెడ్డి, రామ్మోహన్, ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, విద్యాసాగర్, వి శ్రీనివాస్, పి శ్రీనివాస్, ఎం శ్రీనివాస్, శోభా, అజిత్‌ఖాన్, రేణుక, పుష్పరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: ధర్మకంచ పాఠశాలలో..

పట్టణంలోని ధర్మకంచలో..

జనగామ రూరల్: పట్టణంలోని ధర్మకంచ ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది ఉపాధ్యాయయులు పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. కాగా, వారికి బుధవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం జి.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు నర్సింహులు, బాలరాజు, మారుతి, లింగారెడ్డి, శ్రీవేణి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లి, ఆలింపూర్‌లో..

బచ్చన్నపేట: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు రత్నం, రఘుమూర్తిలను విద్యార్థులు హెచ్‌ఎం ఘనంగా సన్మానిస్తున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గొట్టె కనుకయ్య, ఉపాధ్యాయులు ప్రవీణ్, రజిత, పద్మ, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు. అలాగే బదిలీపై వెళ్లిన మండలంలోని ఆలింపూర్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కోటి, రమణి, మమత, వనజలను మాజీ సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మహ్మద్ మసూద్ మెమొంటోలు అందజేసి సన్మానించారు. హెచ్‌ఎం స్వర్ణలత, టీచర్లు నర్సమ్మ, మంగ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న విద్యుత్ అధికారులు

రఘునాథపల్లి: మండలంలోని కుర్చపల్లి గ్రామానికి 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైన నేపథ్యంలో బుధవారం ఎన్పీడీసీఎల్ అధికారులు స్థల పరిశీలన చేశారు. గ్రామ శివారులోని 116, 117 సర్వే నంబర్లలోని ఎకరం భూమిని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌కు రూ 2 .26 కోట్లు మంజూరయ్యాయని విద్యుత్ అధికారులు తెలిపారు. కుర్చపల్లిలో గత కొన్ని ఏళ్లుగా విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నందున సబ్‌స్టేషన్ మంజూరుతో ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందుతుందని విద్యుత్ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ టి.వేణుమాదవ్, ఏడీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ రాహుల్, మాజీ సర్పంచ్‌లు ప్రకాష్‌రెడ్డి, తోటకూరి రమేష్ తదితరులు ఉన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు



అవగాహన కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: యువత వ్యసనాలకు బానిస కావొద్దని ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని శివునిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం గంజాయి, మాదక ద్రవ్యాలు, గుడుంబా వలన కలిగే నష్టాలపై స్టేషన్‌ఘన్‌పూర్ సివిల్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, నాటుసారా తాగడమే కాదు, విక్రయించడం, తోటి వారిని తాగమని ప్రేరేపించడమూ నేరమే అన్నారు. ఇలాంటి వాటికి బానిసై నిండు జీవితాలను ఆగం చేసుకోవద్దని సూచించారు. సిబ్బంది సలీమ్, యాకూబ్‌పాషా, రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

జఫర్‌గఢ్: కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్‌గౌడ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్న హామీని తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వెంటనే హామీల అమలు దిశగా కార్యాచరణ చేపట్టాలని కోరారు. నాయకులు గడ్డం రాజు, మెరుగు రామరాజు, ప్రేమ్‌కుమార్, సింగారపు రమేశ్, పి.రాజు, గోదారి సాయిరాం, తాళ్లపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరే కృష్ణను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నాగేశ్‌గౌడ్ తెలిపారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు



బ్యాంకు అధికారుల నుంచి రుణమాఫీ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ కొమురయ్య

రఘునాథపల్లి: రైతులకు రుణమాఫీ డబ్బులు చెల్లించడంలో ఇబ్బందులకు గురి చేయొద్దని జనగామ ఆర్డీఓ కొమురయ్య బ్యాంకు అధికారులకు సూచించారు. మండలంలోని ఎస్‌బీఐ, ఏపీజీవీబీల్లో రైతు రుణమాఫీ అమలును ఆయన తహసీల్దార్ పురం యుగేందర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఎస్‌బీఐ మేనేజర్ మైనావతి, ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ తిమ్మప్ప, అకౌంట్ ఆఫీసర్ బుచ్చయ్యను రుణమాఫీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే రుణమాఫీని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి



కోర్టుకు హాజరైన జిల్లా ఉద్యమకారులు

జనగామ: జిల్లా ఉద్యమ కారులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తి వేయాలని ఉద్యమకారుల పక్షాన నాయకుడు ఉడుగుల రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ఉద్యమకారులు జనగామ కోర్టుకు హాజరయ్యారు. గడిచిన 8 ఏళ్లుగా కోర్టుచుట్టూ తిరుగుతున్నామన్నారు. కోర్టుకు హాజరైన వారిలో మంగళంపల్లి రాజు, మంతెన మణి, తిప్పారపు విజయ్, ఎండీ మాజిద్, పిట్టల సురేష్, తీగల సిద్దూగౌడ్, గడ్డం కృష్ణ, బండి రాకేష్, కర్రె సతీష్, మునిగె నాగరాజు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అనిల్

తరిగొప్పుల: మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి అనిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని కనీలకుంట్లలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దేవందర్‌రెడ్డి, ఎంపీఓ ఆగా మిస్మా ఆలాం, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలి

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలని జీపీ కార్యదర్శులు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ బుధవారం అంగన్ వాడీ కేంద్రాల తనిఖీలో భాగంగా వారు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి మాట్లాడారు. కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రవి

రఘునాథపల్లి: ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ అందించే వివిధ రకాల స్కీంలను పౌరులు సద్వినియోగం చేసుకోవాలని జనగామ ఈస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రవి అన్నారు. బుధవారం మండలంలోని మండలగూడెంలో స్థానిక బ్రాంచ్ పోస్టుమాస్టర్ నవానట్ అధ్యక్షతన జరిగిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళలు, చిన్నారులతో పాటు అన్ని వర్గాలకు చెందిన వారికి పోస్టల్ డిపార్ట్‌మెంట్ అందించే పొదుపు బీమా పథకాలను ఐపీపీబీ బ్యాంకింగ్ ద్వారా అందించే సేవలను ప్రజలు వినియోగించుకొని లబ్ధిపొందాలని కోరారు. కార్యక్రమంలో పోస్టు పేమెంట్ మెనేజర్లు జైల్‌సింగ్, రమేష్, పంచాయతీ కార్యదర్శి నరేష్, చీమలపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి చేయూతనివ్వాలి



క్రీడా సామగ్రిని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి

కొడకండ్ల: నిరుపేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, దాతలు కూడా ముందుకొచ్చి చేయూతనివ్వాలని ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి కోరారు. అమ్మ ఆస్పత్రి డాక్టర్ రాజుతో పాటు గాయపు బాల్‌రెడ్డి కుటుంబసభ్యులు రూ. 28 వేల విలువ చేసే క్రీడా సామగ్రిని హక్యాతండా ప్రాథమిక పాఠశాలకు ఇవ్వగా ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మారుమూల గిరిజన తండా విద్యార్థులకు చేయూతనిచ్చిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ గ్రేస్‌కేజీయారాణి, హెచ్‌ఎం వంగాల రజిత, సీఆర్పీ జ్ఞానానందం, కార్యదర్శి స్వరూప, శ్రీవణ్య, బాలాజీ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

పాలకుర్తి: మండలంలోని ఎల్లరాయని తొర్రూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులను పాఠశాల పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయుడు బొగ్గారపు శ్రీనివాస్ సతీమణి వాణిశ్రీతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం పెనుగొండ రమేష్ మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలను విస్మరించకుండా శ్రీనివాస్ విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సూర్యప్రకాశ్ రెడ్డి, భగవాన్ రెడ్డి, జూలూరు రమేశ్, గౌసియా బేగం, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన మార్గం కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, దాసరి కుల సంఘ నాయకులు మృతుడి సోదరుడు, సంఘం మండల ఉపాధ్యక్షుడు రవీందర్‌కు రూ.14వేల సాయం బుధవారం అందజేశారు. దాసరి సంఘం ప్రధాన కార్యదర్శి తొండ వేణుగోపాలస్వామి, సంయుక్త కార్యదర్శి మార్గం నరేష్, కోశాధికారి తొండ రామకృష్ణ, సోమనర్సింహస్వామి, సీతారామాంజనేయులు, ప్రభాకర్, సోమనర్సయ్య, ఉపేందర్, నితీష్, ప్రకాశ్ ఉన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన తంగళ్లపల్లి స్వర్ణలత మృతి చెందింది. కాగా, బాధిత కుటుంబ సభ్యులను పడమటికేశ్వాపూర్ మాజీ సర్పంచ్ గిద్దెల రమేశ్ పరామర్శించి రూ. 10 వేల సాయం అందజేశారు. మహాత్మాచారి, కర్రె నరేష పంబాల రాములు, అఖిల్‌మాల ఉన్నారు. అలాగే బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగిటి విద్యానాథ్ రూ. 5వేల సాయం చేశారు. దిడ్డిగ రమేష సుమన్, వెంకటాచారి, ప్రసాద్, ఉమాసాగర్ ఉన్నారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

లింగాలఘణపురం: ప్రమాదవశాత్తు మృతి చెందిన కల్లుగీత కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట మల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన కల్లుగీత కార్మికు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని అన్నారు. ఆగస్టు 2 నుంచి 18 వరకు జరిగే అమరుల యాదిలో రాష్ట్ర సామాజిక చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య మాట్లాడుతూ సేఫ్టీ మోకులను ఉచితంగా ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసు, వెంకటేశ్, శంకరయ్య, సమ్మయ్య, అంజనేయులు రమేష్, వసంత్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన



బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

స్టేషన్‌ఘన్‌పూర్: నాయకులకు, అధికారులకు తెలిపినా పట్టించుకోక పోవడంతో బుధవారం బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు మండల కేంద్రంలోని మోడల్‌కాలనీ వాసులు. కాలనీ ఏర్పడిన నాటి నుంచి 8,9 వార్డులో దాదాపు 25 ఇళ్లు ఉంటాయి. కాలనీలో మొత్తం సీసీ రోడ్డు వేసినా ఇక్కడ మాత్రం నిర్మించలేదు. చిన్న వర్షం పడినా మట్టి రోడ్లు బురదమయంగా మారి నడవలేకుండా అవుతుంది. కేవలం ఎన్నికల సమయంలో ఓట్లకోసం వచ్చే నాయకులు తాము గెలువగానే సీసీ రోడ్లు వేయిస్తామని హామీలు ఇవ్వడమే తప్ప పట్టించుకోవడం లేదు. ఇటీవల రోజు వర్షం పడుతుండడంతో రోడ్లు బురదగా మారి నడువ లేని పరిస్థితికి చేరుకోగా అధికారులకు విన్నవించినా పట్టించుకోక పోవడంతో నాట్లు వేసి నిరసన తెలిపారు. రాజోజు మీనాచారి, సతీష్, గణేష్, స్వామి, పద్మ, రాజోజు భాగ్య, రేణుక, శారధ, రాధిక, అనిత, రమ, స్వరూప, రాజేశ్వరి, రాజమ్మ పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



స్టేషన్‌ఘన్‌పూర్: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



చిల్పూరు: కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు



జనగామ: విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్



నర్మెట: కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జనగామ/తరిగొప్పుల/బచ్చన్నపేట/నర్మెట/స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/లింగాలఘణపురం/కొడకండ్ల/పాలకుర్తి/రఘునాథపల్లి/దేవరుప్పుల: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్ రెడ్డి, ఎడవెల్లి కృష్ణారెడ్డి, నల్ల రాహుల్, చింతకింది సురేశ్, మహేందర్‌రెడ్డి, చల్లా చందర్‌రెడ్డి, సిందె రామోజీ, పసునూరి నవీన్, పింగిళి జగన్‌మోహన్ రెడ్డి, బొడిగం చంద్రారెడ్డి, ఇర్రి రమణారెడ్డి, ముసిపట్ల విజయ్, గైని శ్రీనివాస్‌గౌడ్, సుందర్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, కేటీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకొని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియాలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు.

పాఠశాలలో సంప్రదాయ క్రీడా పోటీలు



పులి-మేక ఆట ఆడుతున్న విద్యార్థులు

తరిగొప్పుల: శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలకేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పులి మేక, గెంతుడు పలురకాల సాంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బానోతు రవీందర్, ఫిజికల్ డైరెక్టర్ సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.